• బాసరలో..



మహాగౌరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన బాసర సరస్వతి అమ్మవారు - బాసర

• వరంగల్‌లో..



దుర్గామాత అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వరంగల్ భద్రకాళి అమ్మవారు -వరంగల్

• భద్రాచలంలో..



భద్రాచలం రామాలయంలో ఐశ్వర్యలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు. -భద్రాద్రి కొత్తగూడెం

• ఏడుపాయలలో...



మెదక్ జిల్లా ఏడుపాయలలో నవదుర్గభవాని రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు- మెదక్

• అలంపూర్‌లో క్షేత్రంలో..



జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ క్షేత్రంలో మహాగౌరిగా దర్శనమిస్తున్న అమ్మవారు

• శ్రీశైలంలో




మహాగౌరి దేవీ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు. -అలంపూర్/శ్రీశైలం

• ఇంద్రకీలాద్రిపై..



ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు. హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)



సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని గురువారం కూకట్‌పల్లి రంగధాముని చెరువుగట్టుపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు




సిద్దిపేటలో కోమటిచెరువు వద్ద సద్దుల బతుకమ్మ సంబురాలకు వస్తూ ప్రజలకు సమస్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# కాంగ్రెస్ వచ్చింది ఉయ్యాలో.. గూడు కూల్చింది ఉయ్యాలో..!

- మూసీ ఇండ్ల కూల్చివేతలకు నిరసనగా బతుకమ్మ పాటలు
- గొంతెత్తిన మహిళలు.. చప్పట్లతో రేవంత్ పాలనొద్దని నిరసన

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 10 ( నమస్తే తెలంగాణ ): మూసీ పరివాహక ప్రాంత ప్రజలు హైడ్రా, సీఎం రేవంత్‌రెడ్డిపై తమ ఆక్రోశాన్ని బతుకమ్మ ఆడుతూ వెళ్లగక్కారు. 'కాంగ్రెస్ వచ్చింది ఉయ్యాలో.. గూడు కూల్చింది ఉయ్యాలో...' అంటూ సీఎం రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా మూసీ పరీవాహక ప్రాంతాల్లో బతుకమ్మ పాటలతో మహిళలు గొంతెత్తారు. చప్పట్లు కొడుతూ కాంగ్రెస్ సర్కార్‌కు పోయేకాలం వచ్చిందని హెచ్చరించారు. నాగోల్, రామాంతపూర్, చైతన్యపురి, సైదాబాద్, అంబర్‌పేట మూసీ ప్రాంతాల్లో మహిళలు బతుకమ్మ ఆడుతూ కూల్చివేతలు, రేవంత్‌రెడ్డి పాలనకి వ్యతిరేకంగా బతుకమ్మ ఆడారు. ఈ పాటలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అందులో...'గుంపు మేస్త్రీ పాలన ఉయ్యాలో.. గుదిబండ తీరాయే ఉయ్యాలో.. పేదల బతుకుల్లో ఉయ్యాలో.. చీకటి నింపిండు ఉయ్యాలో.. గూడు చెదిరిపాయే ఉయ్యాలో.. గుండెలవిసిపాయే ఉయ్యాలో.. కాంగ్రెస్ రేవంత్ ఉయ్యాలో.. కాలయముడైపాయే ఉయ్యాలో..' అంటూ నిరసన వ్యక్తం చేశారు. 'మా ఇండ్లు కూల్చిండ్రే బతుకమ్మ.. మా నోట్లో మన్నేసే బతుకమ్మ.. ఇల్లంటే అమ్మలానే బతుకమ్మ.. అమ్మలేని పిల్లలమైనామే..' అంటూ నిరసన వ్యక్తం చేశారు. 'రేవంత్ సారూ ఉయ్యాలో.. నీ జాగల నువ్వు ఉండు ఉయ్యాలో.. మా ఇండ్ల మమ్మల్నీ ఉండని య్యవయ్య ఉయ్యాలో..' అంటూ మహిళలు పదం కదుపుతూ నిరసన వ్యక్తం చేశారు.

# 'బతుకమ్మ' సాక్షిగా వడ్డెర మహిళకు అవమానం

- మాతో కలిసి ఆడొద్దని కురుమ కులస్థుల అడ్డగింత
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్వగ్రామంలో ఘటన

యాదగిరిగుట్ట, అక్టోబర్ 10: బతుకమ్మ సాక్షిగా ఓ వడ్డెర మహిళ అవమానానికి గురైంది. బతుకమ్మ పండుగలోనూ కుల చిచ్చు రాజేశారు ఆ ఊరి కులస్థులు. 'మా బతుకమ్మతో మీరు ఆడొద్దు' అంటూ ఇరు కులాల వారు ఘర్షణకు దిగారు. ఈ అమానుష ఘటన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో గురువారం జరిగింది. వడ్డెర కులానికి చెందిన పల్లపు సమ్మక్క బతుకమ్మను తీసుకొస్తుంటే.. 'మాతో మీరు బతుకమ్మ ఆడవద్దు. మీరు వేరేగా ఆడుకోండి' అని కురుమ కులస్థులు అడ్డు చెప్పారు. దీంతో ఇరు కులాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వడ్డెర కులస్థురాలికి చెందిన బతుకమ్మను వేరు చేసి వేడుకలను కొనసాగించారు. గ్రామంలో ఒకే ఒక వడ్డెర మహిళ ఉండటంతో ఆమె బతుకమ్మ ఎక్కడ ఆడాలో తెలియక ఇబ్బంది ఎదుర్కొంది. ఈ ఘటన జరుగుతున్న సమయంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణి అనిత అక్కడే ఉన్నారు.

## టీ కన్సల్ట్ ఆధ్వర్యంలో రాయల్ అలయన్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : ప్రపంచవ్యాప్తంగా ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు టీ కన్సల్ట్ ద్వారా రాయల్ అలయన్స్ ఏర్పాటు చేసినట్టు టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ మక్తాలా, ఫిలిప్పీన్స్ రాణి లియోనారా టోరెస్ తెలిపారు. గురువారం కొండాపూర్‌లోని టీహబ్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పెద్దఎత్తున అవకాశం ఉన్న పెట్టుబడులను సమీకరించి సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. విశ్వవ్యాప్తంగా ఇన్నోవేషన్లు, ఇన్వెస్ట్‌మెంట్లు తీసుకురావడంలో తొలి అడుగు పడిందన్నారు. ఈ ఒప్పందం ద్వారా పెట్టుబడుల సమీకరణ మరింత సులభతరం అవుతుందని వెల్లడించారు.

## తహసీల్దార్ల బదిలీకి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లకు ప్రభుత్వం ఊరట కల్పించింది. వారి బదిలీలకు తాజాగా రెవెన్యూ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల బదిలీపై వచ్చిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల వివరాలు పంపాలని సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. పేరు, ప్రస్తుతం పనిచేస్తున్న, గతంలో పనిచేసిన, సొంత జిల్లాల వివరాలతో మూడ్రోజుల్లోగా వివరాలు పంపాలని ఆదేశాలు జారీచేశారు. వారిని వెనక్కి పంపాలని వివిధ యూనియన్ల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి టీజీటీఏ, ట్రెసా కృతజ్ఞతలు తెలిపాయి.

## డీఎస్సీలో 'రామయ్య కోచింగ్' ప్రభంజనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ అక్టోబర్ 10: డీఎస్సీ ఫలితాల్లో రామయ్య కోచింగ్ సెంటర్ ప్రభంజనం సృష్టించింది. టీచర్ ఉద్యోగాలు పొందినవారితో కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్, జిల్లా టాప్ ర్యాంకుల్లో ఎక్కువ మంది రామయ్య కోచింగ్ సెంటర్‌లోనే శిక్షణ పొందారని చెప్పారు. అభ్యర్థులతోపాటు వీరి విజయానికి కృషి చేసిన సంస్థ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# పేదల ఇండ్లు కూల్చడమే ప్రాధాన్యమా?

- సంక్షేమం దెబ్బ తినకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత
- ఇండ్లు కూల్చడానికి ముందు ప్రత్యామ్నాయం చూపాలి
- హైదరాబాద్‌లో రోడ్లు బాగా లేవు, ట్రాఫిక్ అస్తవ్యస్తమైంది
- నగరంలో ప్రతి ఇంట్లో చికున్ గున్యా, డెంగీ బాధితులు
- నాయకత్వ బాధ్యతల్లో ఉన్నోళ్లు ఇంగిత జ్ఞానంతో మాట్లాడాలి
- ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో జయప్రకాశ్ నారాయణ



హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): పేద, మధ్యతరగతి వాళ్లు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల గురించి తెలియక డబ్బులు పెట్టి ఇండ్లు కట్టుకొని, వాటికి పన్నులు కడుతుంటే.. ఆ పేదల ఇండ్లను కూల్చడమే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యంగా పెట్టుకోవద్దని లోక్‌సత్తా పార్టీ నేత జయప్రకాశ్ నారాయణ సూచించారు. ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన హైడ్రా దూకుడు, హైదరాబాద్‌లో రోడ్లు, ట్రాఫిక్ అధ్వాన పరిస్థితులు, మంత్రి కొండా సురేఖ కామెంట్స్‌పై స్పందించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పేరిట ప్రభుత్వం ఇండ్లు కూల్చడానికి, వాటిలో ఉన్నవారిని తరలించడానికి ఓ ప్రణాళిక, దానికిముందు ఒక సమగ్ర సర్వే అవసరమని చెప్పారు. సమాజ హితానికి నష్టమైతే కచ్చితంగా ఇండ్లు తొలగించాలని, అంతకంటే ముందు వారికి ప్రత్యామ్నాయం చూపించాలని అన్నారు. లేదా వీలైనంత వరకూ రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమం దెబ్బతినకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

### అధికారులు లంచాలు తీసుకోవద్దు..

గతంలో తాను కూకట్‌పల్లిలో ఉన్నప్పుడు కొందరు ఓ నాలాను ఆక్రమిస్తే.. వారిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు జయప్రకాశ్ నారాయణ చెప్పారు. అప్పటివరకూ ఉప్పు, నిప్పులా ఉన్న నాయకులు ఈ విషయంలో కలిసిపోయి ఆ అధికారిని బదిలీ చేయించారని చెప్పారు. ఇలా రాజకీయ, అధికార యంత్రాంగాలు అప్పుడు చేసిన తప్పులు చాలానే ఉన్నాయని అన్నారు. కాబట్టి.. ప్రస్తుత ప్రభుత్వం కూడా కొన్ని చోట్ల ఆచితూచి వ్యవహరించాలని కోరారు. ఒక గీత గీశాను కాబట్టి.. వాళ్లందరనీ కూలగొడతాం అంటే కుదరదని చెప్పారు. 'అధికారులే లేఅవుట్లు వేశారు, వారే అప్రూవల్ ఇచ్చారు, వారే రిజిస్టర్ చేశారు, లక్షల రూపాయల స్టాంప్ డ్యూటీలు కట్టించారు. ఉన్నపళంగా ఇండ్లు తొలిగిస్తామంటూ వస్తే ప్రజల్లో కచ్చితంగా వ్యతిరేకత వస్తుంది' అని అన్నారు. అందుకే అధికారులు ఇట్లాంటి విషయాల్లో లంచాలు తీసుకోకుండా పనులు చేయాలని చెప్పారు.

### నగరంలో పరిస్థితి దారుణం

రాష్ట్రంలో ఈ మధ్య విద్యుత్తు సరిగా ఉండటం లేదని, పారిశుధ్య లోపం కారణంగా దోమలు స్వైర విహారం చేస్తున్నాయని జయప్రకాశ్ నారాయణ ఆరోపించారు. హైదరాబాద్‌లో నేడు ప్రతి ఇంటిలో ఓ చికున్ గున్యా, డెంగీ బాధితుడు ఉన్నాడని చెప్పారు. ఒక డాక్టర్ రోజుకు పది కేసులు చూస్తున్నాడని, అధికారిక లెక్కల్లో వాటిని చూపకపోవడం దారుణమని అన్నారు. హైదరాబాద్‌లో రోడ్లను తక్షణం బాగు చేయాలన్నారు. ట్రాఫిక్ చాలా అధ్వానంగా, అస్తవ్యస్తంగా మారిందని, వాటిని తక్షణం సరిదిద్దే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్యంపై పెట్టే ఖర్చుకు జవాబుదారీతనం ఉండాలని అన్నారు. మంత్రి కొండా సురేఖ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నాయకత్వ బాధ్యతల్లో ఉన్నవారు ఒక్కోసారి సామాన్యులను చూసి నేర్చుకోవాలని, ఇంగితజ్ఞానంతో మాట్లాడాలని అన్నారు. ప్రతి వ్యక్తికి ప్రైవసీకి ఉంటుందని, దాన్ని గౌరవించాలని చెప్పారు.



కేసీఆర్‌నగర్‌లో డబుల్‌బెడ్రూం ఫ్లాట్ వద్ద అనిల్‌కుమార్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్

## తండ్రిని గెంటేసిన కొడుకులపై చర్యలు

- డబుల్ బెడ్రూం ఇల్లు రద్దు చేసిన ఆర్డీవో
- ఏడు రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశాలు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 10: తండ్రిని ఇంట్లో నుంచి గెంటేసిన కొడుకులపై అధికారులు చర్యలు తీసుకున్నారు. వారికి కేటాయించిన డబుల్ బెడ్రూం ఇల్లును రద్దు చేసి, వారంలోగా ఖాళీ చేయాలని ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌కు చెందిన అడవిల రాజమల్లుకు అనిల్‌కుమార్, సురేశ్‌కుమార్ ఇద్దరు కొడుకులు. వీరికి ప్రభుత్వం కేసీఆర్ నగర్‌లో ఫ్లాట్ నంబర్ 23లో డబుల్ బెడ్రూం ఇంటిని మంజూరు చేసింది. తండ్రిని కొడుకులు ఇంట్లోంచి గెంటేయడంతో రాజమల్లు ఆర్డీవో రమేశ్‌ను ఆశ్రయించారు. సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం కొడుకులకు నోటీసులు అందజేసి, విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. అనిల్‌కుమార్ హాజరుకాకపోవడంతో ఫ్లాట్‌ను ఏడు రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించారు. సురేశ్‌కుమార్ భార్య పేరిట ఉన్న డబుల్ బెడ్రూం ఇల్లు పట్టా రద్దు చేయాలని తహసీల్దార్ జయంత్‌కుమమార్‌కు సూచించారు. ఇంటిని రాజమల్లుకు కేటాయిస్తామని వెల్లడించారు.

# అరికెపూడి గాంధీ ఏకాకి!

- చాంబర్ ప్రారంభానికి ముఖం చాటేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- పీఏసీ సభ్యులూ గైర్హాజరే...
- కాంగ్రెస్ తీరుపై గాంధీ అసంతృప్తి

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): పీఏసీ చైర్మన్‌గా నియమితులైన అరికెపూడి గాంధీ ఒంటరయ్యారు. అసెంబ్లీలో తన చాంబర్‌ను గురువారం అట్టహాసంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఒక్క మంత్రి కానీ, అధికార పార్టీ ఎమ్మెల్యేలు కానీ హాజరుకాలేదు. అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, ఇతర అధికారులు మాత్రమే హాజరయ్యారు. కనీసం పీఏసీలో సభ్యులు,ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు హాజరుకాకపోవడంతో ఆయన ఒంటరయ్యారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అటు కాంగ్రెస్‌కు, ఇటు బీఆర్ఎస్‌కు దూరం కావడంతో ఒంటరిగా మిగిలిపోయారని విశ్లేషిస్తున్నారు. పీఏసీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ ఎంతో అట్టహాసంగా జరగాల్సి ఉండగా ఒక్కరు కూడా హాజరుకాలేదని అనుచరుల వద్ద గాంధీ ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం. తాను ఎటూ కాని వాడిగా మిగిలిపోవాల్సి వస్తున్నదని నియోజకవర్గానికి చెందిన పార్టీ కీలక నాయకుల వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లి తప్పుడు నిర్ణయం తీసుకున్నానా? అంటూ అంతర్మథనం చేసుకుంటున్నట్టు సమాచారం. బీఆర్ఎస్‌లో ఉన్న పాత సహచరులతోనూ ఇదే విషయాన్ని ప్రస్తావించినట్టు తెలిసింది. పీఏసీ చైర్మన్ పోస్టును ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడికి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన గాంధీకి ఇవ్వడంపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో నిరసన తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, స్పీకర్‌ను నిలదీసింది.

# ఆదాయ సమీకరణపై దృష్టి పెట్టండి

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సమీకరణపై దృష్టిపెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే వివిధ శాఖల అధికారులతో సీఎం గురువారం సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. కాగా, పలు వు రు నేతలు, అధికారులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బీసీ కుల సర్వేపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 13న అలయ్ బలయ్‌లో పాల్గొనాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి సీఎంకు ఆహ్వానపత్రిక అందజేశారు. 15న నిర్వహించే దామగుండం నేవీ రాడార్ ప్రాజెక్టు శంకుస్థాపనకు రావాలని సీఎం రేవం త్‌రెడ్డిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్‌బీర్ సింగ్, నేవీ అధికారులు ఆహ్వానించారు.

### రతన్ టాటా మరణంపై సంతాపం..

ప్రముఖపారిశ్రామికవేత్త రతన్ టాటా మరణంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. రతన్ టాటా నిష్క్రమణ పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ దేశానికి తీరని లోటని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

# మాఫీ సొమ్ము వాపస్ కట్టండి

> మొదటిపేజీ తరువాయి...

రుణమాఫీపై సమాచార హక్కు చట్టం కింద లీడ్ బ్యాంక్ భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) నుంచి సేకరించిన సమాచారంలోనూ పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ కాలేదని తేలింది. దీనిని బలపరుస్తూ తాజాగా మరో ఘటన జరిగింది. రుణాలు తీసుకున్న రైతులు వడ్డీతో సహా చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి అందుతున్న నోటీసులు చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. హామీ ఇచ్చిన ప్రకారం ప్రభుత్వం రుణాలు మాఫీ చేయకపోవడంతో పండుగ పూట బ్యాంకులు నోటీసులు పంపుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### నోటీసుకు అయిన ఖర్చు కూడా రైతు ఖాతాలోనే

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు నోటీసులు పంపింది. గ్రామానికి చెందిన రైతులు గెనమోని జంగయ్య నిరుడు రూ.1.60 లక్షలు (వడ్డీ రూ.6,032.11), రెండేండ్ల క్రితం ఉడుత పార్వతమ్మ రూ.1.30 లకలు (వడ్డీ రూ.12,429), ఏడాది కిందట నీలం వెంకటయ్య రూ.1.60 లక్షలు, పాడి కోసం అదనంగా రూ.50 వేల రుణాన్ని (వడ్డీ రూ.8,025) అచ్చంపేటలోని ఏపీజీవీబీలో తీసుకున్నారు. వీరు తీసుకున్నది రూ. 2 లక్షల లోపే అయినా రేవంత్ సర్కారు చేసిన రుణమాఫీ వీరికి వర్తించలేదు. పైగా అసలుతోపాటు వడ్డీ కలిపి చెల్లించాలని బ్యాంక్ నుంచి నోటీసులు అందాయి. అంతే కాదు, నోటీసు పంపేందుకు అయిన రూ. 59 కూడా మీ ఖాతాలోనే కలుపుతామని నోట్ పెట్టడం గమనార్హం.



జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలో ఉపవాస దీక్ష చేపట్టిన జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్

## రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలి

కొడకండ్ల, అక్టోబర్ 10: రైతులకు వెంటనే రూ.2 లక్షల లోపు ఉన్న రుణాలను పూర్తి స్థాయిలో మాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్, బంజారా కీర్తిరత్న అవార్డు గ్రహీత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అభిమాన్ గాంధీనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలోని తన నివాసంలో ఆయన 48 గంటల ఉపవాస దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని, లేకుంటే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్తారని గాంధీనాయక్ హెచ్చరించారు.

## రాష్ట్రానికి 3,745 కోట్లు విడుదల

**కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాల వెల్లడి**

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ గురువారం విడుదల చేసింది. అక్టోబర్‌లో చెల్లించాల్సిన ముందస్తు వాటాగా రూ.89,086.50 కోట్లతో కలిపి రాష్ట్రాలకు మొత్తం రూ.1,78,173 కోట్లు విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు రూ.3,745 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,211 కోట్లు వచ్చాయి. పండుగల సీజన్ దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి అనుగుణంగా పన్నుల వాటాను విడుదల చేసినట్టు కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది.